"ప్రఖ్యాత సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు-"

రెండున్నర సెకండ్లు ఆగాడు; వార్తలు చదివిన వ్యక్తి. అతని మొహంలో (రూల్ ప్రకారం) దుఃఖం లేదు గాని సంతోషం అసలు లేదు. కేవలం శాంతి స్వరూపం; అంతే.

"1990కి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును గెల్చుకున్నారు."

పాపం శమించుగాక! ఇలా, రెండు సెకన్లు కాదు ఒక్క సెకండ్ అయినా సరే ప్రేక్షకుల్ని ఏడిపించే హక్కు న్యూస్ రీడర్లకి లేదు.

అవును న్యూస్ రీడర్లుకి ఆహక్కు లేదు.

లేదు గాక లేదు! ★

# 42. పెన్షన్ గొడవలు

'**జా**తస్య మరణం ధ్రువమ్' అన్నారు ఎవరో. ఎవరో ఏమిటి రుషులే అనుంటారు.

ఉద్యోగిస్య పెన్షన్ ధ్రువమ్ అని కూడా అనవలసింది.

రూల్సులో వున్నా రుషులు చేస్తే దాని సొగసు వేరు. అంచేత - ఎలాగా లక్నో వెళుతున్నాను కదా అని అక్కడికి దగ్గర్లో వున్న నైమిశారణ్యానికి వెళ్లేను.

అక్కడ అన్ని కులాలకి చెందిన రుషులూ బోల్డుమంది "బోల్డు" గా తపస్సు చేసుకుంటున్నారు.

ఒహాయన్ని డిస్టర్బ్ చేసి "అనండీ" అన్నాను.

"ఏమిటనమంటావు" అన్నారాయన.

"ఉద్యోగిస్య పెన్షన్ ధ్రువం - అనండి"- అన్నాను.

"అన్లేను." అన్నారాయన.

"అదేం?"

"ధ్రువం అనేటప్పుడు ఉత్తర ధ్రువమా దక్షిణ ధ్రువమా అని నిర్ణయించాలి కదా." అని ఆయన మళ్లీ సమాధిలోకి వెళిపోయారు.

"అమ్మ నాయనో మీక్కూడా తెలిసిందీ, ఉత్తర దక్షిణాల సంగతి?" అనుకుంటూ మళ్లీ వొచ్చేసేను.

ఏజీ ఆఫీసులో నా ఏజి గ్రూపువాళ్లూ నా వేజి గ్రూపు వాళ్లూ చాలామందే వున్నారు.

ఉత్తరం అక్కర్లేదు. దక్షిణం అక్కర్లేదు.

అయితే పని మాత్రం జరగదు. రికమెండేషన్ తెస్తే - "అయ్యో గురూగారూ; మీకు హెల్ప్ చెయ్యమని ఇంకో కోన్‌కిస్కాయి ఉత్తరం రాసి ఇవ్వడమా" అని నెత్తి కొట్టుకుంటారు.

"ఇంకో కోన్‌కిస్కాయి" అన్న ఎక్స్‌ప్రెషన్‌లో నా ప్రసక్తి ఉండొచ్చు. ఉండకపోవచ్చు.

పోనీ ఏదైనా సంభావన ఇద్దామని జేబులో చెయ్యి పెట్టినట్టు నటిస్తే "మమ్మల్ని అంత

కిరాతకులుగా భావించండి" అని నా చేతిని నా జేబులోకి వెళ్లకుండా ఆపేస్తారు. "అంత కిరాతకులు" అన్న దాంట్లో "కొంత కిరాతకులు"కి అవకాశం ఉండొచ్చుననుకోడానికీ వీల్లేదు.

అలా అలా - విశాఖపట్నానికీ హైదరాబాదుకీ మధ్య పదహారు నెలలు తిరిగి -

పదిహేడో నెలనాడు టిక్కెట్ కొనుక్కుందామని రైల్వేస్టేషన్ కెళ్తుంటే కనిపించేడు చిదంబరం.

రామాయణంలో హనుమంతుల వారు లంకనించి వొచ్చినపుడు చెప్పినట్లు-

"తెచ్చేసేన్ నీ పెన్షన్ పేపర్సు" అని మొదలెట్టేడు.

"మొన్న మా ఆఫీసులో పాసయ్యేయి నీ పేపర్సు. జిల్లా ట్రెజరీ ఆఫీసు కిచ్చిన క్లియరెన్సుతో సహా అన్నీ నేనే పట్టుకొచ్చి నిన్న మీ ఆఫీసులో ఇచ్చేను; పోస్టులో అయితే లేటవుతుందని."

"థేంక్యూ" అని అతని చెయ్యి పట్టుకుని వూపేను.

"అమ్మో...! గడుసు వాడివే. షేక్హాండిచ్చి, చక్కపాడి పొట్లాం ఇచ్చీ వదలగొట్టుకుందామను కున్నావు కాబోసు. అదేం కుదర్దు." అని చెయ్యి లాగేసుకున్నాడు చిదంబరం.

పక్కనే వున్నాది ఒక నక్షత్రాల హోటలు - అందులోకి తీసుకెళ్లేదాకా నక్షత్రకుల్లా పట్టుకున్నాడు.

"పెద్ద టెన్షన్ వదిలించావు" అన్నాను.

"రానంత సేపూ టెన్షనూ.. అది రాగానే పెన్షనూ... ఊ ఊఁ" అని పాడేడు.

"ఇప్పుడింక జిల్లా ట్రెజరీ ఆఫీసులోనూ సబ్ట్రెజరీలోనూ బోలెడు అనుభవాలకి సిద్ధం కావాలి నేను" అన్నాను.

"అనుభవాలేమిటి;" అన్నాడు చిదంబరం వెర్రిమొహంవేసి.

"అదంతేలే. మీరు మహాగణకులు కదా. జిల్లా స్థాయిలో గణకులూ, సబ్ట్రెజరీలో ఉపగణకులూ వుంటారు. వాళ్లందర్నీ సంతృప్తి పరచాలి కదా" అన్నాను.

"ఏమిటో, వ్యంగ్యంగా మాట్లాడుతున్నావు."

"వేరేవిధంగా అనుకోకు. సంతృప్తి పరచడం అంటే యిక్కడ - ఆకాగితాల్ని నిబంధనల ప్రకారం సరిగ్గా వున్నాయని వొప్పించడమే. వొంటరిగా ఫొటోలు , భార్యా సమేతంగా ఫొటోలు దిగాలి. అతనిప్పుడు బతికే వున్నాడని సర్టిఫికెట్ తీసుకోవాలి. ఇతను ఇంకా ఫలానా ఇంత కాలం బతుకుతాడని అనిపిస్తోంది- అంటూ ఒక డాక్టర్ల బృందం నుంచి సర్టిఫికెట్ తీసుకోవాలి".

"దోసె" అన్నాడు చిదంబరం మా పక్కకొచ్చిన ఒక అబ్బాయితో.

వెయిటర్. అంటారతన్ని.

వెయిటర్ అన్న పేరే గాని అతను వెయిట్ చెయ్యకుండా వెళ్లిపోయాడు.

దోశా అంతే.

దోసెడు వుంటుంది మహా అయితే అనుకుంటాం గాని అది ఖరాగా రెండు

చదరపడుగులు ఉపరితల వైశాల్యంతో వుంది.

చతురంబోధిపరీత భూవలయంలా కొబ్బరిచట్నీ అల్లంచెట్నీ కారప్పొడీ సాంబార్లతో పరివేష్టితమూ ఐ వుంది.

చిదంబరం దాని మీద కలియబడి దాన్ని తుంపులు తుంపులుగా చింపి చెండాడుతూ వుండగా నేను పెన్షన్ విషయంలో నా పాత అనుభవాల్ని అతనికి వివరించేను.

"పాత అనుభవమేమిటి? నీ కిదివరకే ఓ పెన్షన్ వుందా?" అన్నాడు చిదంబరం.

"అదేదో మ్యూజియంలో క్లియోపాత్రా గారి మెదడు అని ఒక బాక్సు పెట్టేరు. అందులో ఆవిడ ఈజిప్టు రాణీ కాకముందు మెదడు ఒకటీ, ఈజిప్టు రాణీ అయినాక ఒకటీ మొత్తం రెండు మెదళ్లు దాచిపెట్టేరుట.

"ఒకటి చిన్న మెదడూ, ఒకటి పెద్ద మెదడూట - అలా వుంది నీ ప్రశ్న!" అన్నాను.

నేను గుంటూర్లో జిల్లా సర్వేయరుగా పనిచేసిన రోజుల్లో ఒకసారి ఇల్లు మారుతూ , నన్ను తొలిసారిగా సర్వే ఉద్యోగంలో నియమించిన రమణయ్యగారుంటున్న యింట్లోకి మారేను.

మేం ఆయింట్లో చేరిన మరుసటి నెల ఫస్టు తారీకుని ఆయన తన పెన్షన్ అప్లికేషన్ క్లెయిమ్ ఫారం సంతకం పెట్టి నాకిచ్చేరు. "ఈ వ్యక్తిని నేను ఈ తేదీని జీవించి వుండగా చూసేను" అని ఒక సర్టిఫికెటు ప్రింటు చేసుంది. దానికింద రాష్ట్ర ప్రభుత్వపు - లేదా కేంద్ర ప్రభుత్వపు గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేయించి అధికార ముద్ర వేయించకపోతే పెన్షన్ చెల్లించరు.

"పక్కవీధిలో మీ అసిస్టెంటు డైరెక్టర్ సోమయాజులు గారున్నారు, వెళ్లి సంతకం చేయించుకుని రా," అన్నారు రమణయ్యగారు.

నేనెళ్లే సరికి సోమయాజులు గారు షేవింగు చేయించుకుంటున్నారు. కిటికీలోంచి నేనొచ్చిన సంగతి, నే తెచ్చిన కాగితాల రంగూ చూసి విషయం ఇదేనని గ్రహించినట్టున్నారు. "అక్కడ పెట్టి వెళ్లు, సంతకం చేసి పంపిస్తాను." అన్నారు. సరేకదా అని ఆ కాగితాన్ని టేబిల్ మీద పెట్టి బరువు పెట్టేను. (బరువంటే పేపరు వెయిటే గాని మరోటి కాదు.

లాంగ్వేజిలో కొత్త కొత్త ఇడియమ్స్ వొచ్చి అన్నిటికీ టిప్పణి ఇచ్చుకోవలసి వొస్తోంది - ఖర్మ.)

'సంతకం చేసి పంపిస్తాను' అన్నారే గాని సోమయాజులు గారు స్వయంగా తనే జీపులో వొచ్చారు.

నాకు తెలిసిపోయింది.

"జీవించి వుండగా చూసి వున్నాను" అని సర్టిపై చెయ్యాలి కదా, చూడకుండా ఎలా చేస్తారు!

"ఆఁ, ఏమిటోయి, గోపాలం! నువ్వా ఈ యింట్లోనే దిగేవా?" అన్నారు, రమణయ్య గార్ని "చూస్తూ" జీవించే వున్నారని ధ్రువపరుచుకుంటూ.

"ఎక్కేనండి." అన్నాను.

"ఎక్కడమేమిటి?" అన్నారు, అంత ఆఫీసరూ వెర్రి మొహం వేసి.

"మేడమీద కదండీ మా వాటా. అందుకని అద్దెకి దిగేం అనలేక పోతున్నానండి. అద్దెకక్కేం అనడమే రైటు" అన్నాను.

సోమయాజులు గారు అక్కడిక్కడే సంతకం చేసేరు గాని "రబ్బరు స్టాంపు ఆఫీసు కొచ్చి వేయించుకో. ట్రెజరీ ఆఫీసు అక్కడే కనక ఆతరైజేషన్ నీ పేర రాయించుకో, అంతేగాని వార్ని పేమెంటుకి రమ్మని శ్రమ పెట్టకు" అని వెళ్లారాయన.

ట్రెజరీ ఆఫీసులో అబ్జక్షను పడ్డాది.

"ఇదీ రెండు నెలల పెన్షనుకి క్లెయిమ్, దీంట్లో లివింగ్ సర్టిఫికెటు ఈ నెలకే వుంది. కిందటి నెలకి లేదు."

"ఔనండి. ఆయన కిందటి నెల ఫస్టు తారీకుని ఊళ్లో లేరు. యాత్రల కెళ్లేరు."

"ఏమి యాత్ర" అని అదేదో యమలోక యాత్ర, వైకుంఠ యాత్ర అన్నట్టు ఆగేడు ఆ ఎకౌంటెంటు.

"ఈ నెల ఫస్టుని బతికున్న మనిషి కిందటి నెల్లో కూడా బతికే వున్నట్టు భావించాలి కదండీ" అన్నాను.

"ఫైనాన్స్ విషయంలో "భావించడాలూ", వూహించడాలూ", "అర్థం చేసుకోడాలూ" ఇన్నోటి వుండవండి. సర్టిఫికెట్ "జతపర్చవలెను" - అంటే జతపర్చడమే. మా టైం తినేకండి" అని కాగితాలు నా మీదికి తోస్సేడాయన.ఇంక మరి - తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు గాని చేరి మూర్ఖుని మనస్సు రంజింపరాదు - అనుకొని సోమయాజులు గారి దగ్గరి కెళ్లాను.

"ఓ దానికేముంది, ఇచ్చేద్దాం" అంటూనే ఆయన తన డయిరీ తెరిచి - "సారీ గోపాలం; కిందటి నెల ఫస్టుని నేను బాపట్ల కేంపులో వున్నాను". అన్నారు.

"అయ్యో!" అన్నాను.

కానీ వెంటనే నా పెద్ద మెదడు పెద్ద మనసుని ఎరువు తెచ్చుకుని పనిచేసింది.

"పెద్దాయన సార్. మనలాంటి వాళ్లెందరికో ఉద్యోగాలిచ్చేరు." అన్నాను.

"అదే-" అన్నారు సోమయాజులు గారు.

"అదే ఆయన చేసిన బుద్ధిపొరపాటు. మనలాంటి మూర్ఖులకెందరికో -" అన్లేదు నేను.

రూలు వుంటుంది.

కాని దాని పక్కనే బోలు వుంటుంది.

అంచేత రూలు కాటుకి బోలు దెబ్బ వేసేను.

"అవున్ సార్. మీరు కిందటినెల ఫస్టు తారీకుని బాపట్లలో వున్నారు. ఆ ఇన్‌స్పెక్షన్‌కి నేనూ వచ్చాను. అయితే రమణయ్య గారు వాళ్లమ్మాయిని బాపట్లలోనే ఇచ్చినందువల్ల చుట్టపు చూపుగా ఆయన కిందటి నెల ఫస్టు తారీకుని బాపట్లకి రావడం, ఆ మధ్యాహ్నం పూట మనం వాళ్లింట్లో భోజనాలు చెయ్యడం మంచిదని ఆయన పిలవడం - అన్నీ సరిగ్గా గుర్తుకి తెచ్చుకోండి"

అన్నాను; చీకట్లో బాణం విడుస్తూ.

"మొత్తానికి అసాధ్యుడివోయి గోపాలం!" అంటూ సోమయాజులుగారు సంతకం పెట్టేశారు.

కథ అయిపోయింది.

చిదంబరం దోసె కూడా అయిపోయింది.

★

# 43. ఎపిసోడ్ నెంబరు 14

జగన్నాథానికి వీడ్కోలు చెబుదామని రైలు స్టేషను కెళ్తుంటే చెయ్యి అడ్డంపెట్టి నా స్కూటర్ ఆపేడు ఖుస్రో. "నేనూ అందుకే" అన్నాడు. ఎక్కించుకోక తప్పలేదు. ఖుస్రో మంచి మిత్రుడే; కాని, కొంచెం ఎక్కువ మాట్లాడతాడు. పైగా మధ్యలో ఎన్ని అ"వాంతి"రాలు వచ్చినా తను చెప్పదలుచుకున్నదేదో చెప్పిగానీ నాయకుడు వేదిక దిగనట్టు ఇతను మన వీపు దిగడు. అయినా అతన్ని భరించక తప్పదు. ఎందుకంటే, ఖుస్రో నాకూ జగన్నాథానికీ కామన్ ఫ్రెండు. ఇవాళ రైలు దగ్గిర వీడ్కోలివ్వడానికి అతనికి నేను లిఫ్ట్ ఇవ్వని కారణంగా అతను జగన్నాథాన్ని మిస్ అయ్యేడంటే రేపెప్పుడైనా అతను కనబడ్డప్పుడు "చూసేవా గురూ" అంటూ అంతా చెప్పేగల్డు.

స్టేషన్ చేరే వరకూ అతనే ఏదో మాట్లాడేడు. కాని స్టేషన్ చేరగానే పార్కింగు స్పేస్ దగ్గిర రద్దీ చూసి "అయ్యబాబోయి; ఇన్ని స్కూటర్లున్నాయేంటి, ఇక్కడ!" అన్నాను నేను.

"మరేంటనుకున్నావు! రైలు కెళ్లేవాళ్లు వంద మందయితే సాగనంపే వాళ్లు ఐదువందల మందుంటారు!"

"చినుకులొచ్చేటట్టున్నాయి. బండి తడిసి పోతుందేమో. పార్కింగు చేసుకోడానికిక్కడ షెడ్డు కాదుగదా, చెట్టు నీడయినా లేదు. మళ్ళీ ఈ పది నిమిషాల భాగోతానికీ అర్ధ రూపాయి ఛార్జి చేస్తారు. ఇలా రైలు రైలుకీ రెండు మూడు వందల చొప్పున పోగు చేసే కంట్రాక్టరు ఒక షెడ్డు కట్టించినా బాగుండిపోను."

"రైల్వే జాగాలో షెడ్లు కట్టి ఏం సుఖం? ఏ బీచిరోడ్డు మీదనో, ఎపార్టుమెంట్లు కట్టుకుంటున్నాడేమో, పాపం".

అలా మాట్లాడుకుంటూ ఒక చోట నా స్కూటర్ని ఇరికించాను. ఖుస్రోని దిగమని నేనూ దిగేను. ఇంతలోకే ఆ పద్మవ్యూహాన్ని అవలీలగా చీల్చుకుంటూ ఒక కుర్రాడొచ్చి అత్యంత మిక్కిలి పల్చటి కాగితం (చిన్న) ముక్క నా చేతిలో పెట్టి యాభై పైసలు పట్టుకుపోయాడు. ఆ చిన్ని కాగితం ముక్కని పది నిమిషాలపాటు పారేసుకోకుండా కాపాడుకున్నందుకు ఓ రూపాయి "ఇనాం" ఇవ్వచ్చన్నాడు ఖుస్రో.

"యాభై పైసలకే నువ్వింత ఇదై పోతున్నావు! మొన్న హైద్రాబాదులో వెయ్యేసి రూపాయలు కట్టి కూడా పార్కింగుకీ స్టాండింగుకీ సరైన ఏర్పాటు లేక వానలో తడుస్తూ నిలబడ్డాను తెలుసా?' అన్నాడు, రెండడుగులు నడిచి.